అవసరంలో
ఆదుకున్న వాడు
చిన్నవాడైనా
దేవుడవుతాడా?

గంటిరమాదేవి
కథ

# మెతుకుకొక రూపాయి

నేనీ మధ్యన కష్టాల్లో పడ్డాము. అప్పుడు గుర్తుకొచ్చారు పాత మిత్రులు.

సాయంత్రం అయిదు కాగానే ఆఫీసు బాదరబందీ వదిలించుకుని హుషారుగా క్లబ్బుకు బయలుదేరడం. వేడి వేడి పకోడీలు మిరపకాయలు తింటూ, మధ్యమధ్య టీ చప్పరిస్తూ పేకాట ఆడకుంటూ అర్ధరాత్రి వరకు గడిపేయడం. రాత్రి ఇంటికి వచ్చి మంచంమీద పడి నిద్రపోవడం. ఉదయం తొమ్మిదింటికి బద్ధకంగా లేచి, కాలకృత్యాల తర్వాత ఆఫీసుకు బయలుదేరడం— ఈ దినచర్య అనే చక్రభ్రమణంలో స్నేహితుల్నీ, హితుల్నీ పూర్తిగా మర్చిపోయాను.

ఇలా నేను మత్తులో పడి (ఆదివారాలు మందు పార్టీలు కూడా ఉన్నాయి) కొట్టుకుంటూన్నప్పుడు నా ఆఫీసు కుర్చీ క్రింద గోతులు తవ్వుతున్నట్టు గమనించలేదు.

ఆడిట్లో, రెండు లక్షల వరకు తక్కువైనట్లు తేలింది. ఆఫీసు బాంబుపడినట్టు అదిరిపడింది. ఆ 'సరకు' ఎలా పోయిందో నాకూ తెలియదు. రసీదులు, వోచర్లు ఎక్కౌంటు పుస్తకాలు మళ్ళీ మళ్ళీ చూశాను. లాభం లేకపోయింది.

మర్నాడు భయపడుతూ ఆఫీసుకు వచ్చాను,. పదకొండు గంటల సమయంలో 'సస్పెన్షన్ ఆర్డర్ చేతికందింది.

ముందు రెండు లక్షలు కట్టాలి!
తర్వాత ఎంక్వయిరీ!!
అప్పుడేం జరుగుతుందో!!!

స్వంత ఊళ్ళో నాకు కొంత ఆస్తివుంది. ఉమ్మడి ఆస్తి. మా అన్నలు చూసుకుంటు



న్నారు. కొబ్బరి పొలం రెండెకరాలు, వరి (మాగాణి) మూడెకరాలు మామిడి తోట ట్రాక్టరు మెట్ట ఇరవై ఎకరాలు. నా వాటా ఆస్తి గురించి నేను పెద్దగా పట్టించుకోలేదు. దానిమీద ఆదాయం కూడా నేనెప్పుడూ అడగలేదు. ఈ కష్ట సమయంలో ఆ ఆస్తి నన్నాదుకుంటుందా?

మర్నాడు సాయంత్రం బస్సులో మా

ఊరు చేరుకున్నాను. మూడు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇదేరావడం.

నీరెండలు పొలాలమీద పూసిన బంగారు పూతకు సంబరపడిపోతూ, తలలూపుతున్నాయి వరి కంకులు. చల్లని స్వచ్ఛమైన గాలి మంద్రంగా వీస్తోంది. పంట కాలువ సన్నగా సంగీతం పాడుతూ పరుగుతీస్తోంది. దూరంగా సెంట్రీలా నిలబడ్డ తాటి చెట్టు. దానిమీద మంచి నీలకాశానికి మల్లెదండలా కొంగల గుంపులు.

నేనీపాటికి క్లబ్బులో పేకాట ఆడుతూ వుండాల్సింది మామూలుగా. కిటకిటలాడుతూ మట్టూ మూగిన జనం సిగరెట్లు పొగలలో చిక్కుకున్న బల్బుకాంతులు. అలుక్కుపోయినట్లు మనుష్యులు. టీ త్రాగి త్రాగి పైత్యపు మాటలు. ఉక్కపోత. వికారం—

ఇక్కడెంత బావుంది!

ఉద్యోగంపోతే ఇక్కడే వుండిపోవచ్చు.

మనిషికి కావలసిన పిడెకడన్నం ఇక్కడ దొరక్కపోదు.

పచ్చికదారిలో నడుస్తూ ఇంటికి వెళ్ళాను. ఎలక్ట్రిక్ దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి.

అన్నయ్య అరుగుమీద కూర్చున్నాడు మట్ట కాలుస్తూ. నన్నుచూసి ఎవరూ అన్నాడు.

'నేను అన్నయ్యా!' అని సమాధానం చెప్పాను.

'నువ్వా! రా! రా! ఎప్పుడొచ్చావు? ఒక్కడివే వచ్చావేం? పిల్లలేరీ? సెలవలా?'' అనేక ప్రశ్నలు.

సమాధానం చెప్పలేదు. నా చిక్కుల విషయం మామూలుగా చెప్పాల్సింది కాదు. నెమ్మదిగా చెప్పాలి.

రాత్రి భోజనాలప్పుడు నెమ్మదిగా చెప్పాను. కందిపచ్చడి అన్నంలో మిరపకాయ కొరుక్కుంటున్న అన్నయ్య హఠాత్తుగా ఆగిపోయాడు.

''రెండు లక్షలు కట్టాలా?'' అన్నాడు అదోరకంగా.

''అవునన్నయ్యా!: నా వాటకు రావలసినది—అమ్మేసయినా సరే!'' అన్నాను.

''ఎవుడి స్త్రాదా అంత! వెవసాయం అంటే మాట్లేంటి? మెట్టభూమి పదివేలు, మిగిలివాటికి ఓ రెండు లక్షలు. నీ వాటా మూడోవంతు. అయినా వున్నపళాన అంతెవుడు ఇస్తాడు?''

''నేను జైలుకెళ్ళాలి కట్టకపోతే'' అన్నాను తినడం మానేసి.

''అంత మాటెందుకు గాని—చూద్దాం— ఉదయాన్నే—'' అని ఆయన కంచంలో చెయ్యి కడిగి లేచిపోయాడు.

మర్నాడు ఆయన కనపడలేదు.

రాత్రికి రాలేదు.

చిన్నన్నయ్యను అడిగాను 'అన్నయ్య ఎక్కడికి వెళ్ళాడని' ''నాకు తెలీదన్నాడు''

రెండు లక్షలు కట్టడానికి నాకు పధ్నాలుగు రోజులు టైము ఇచ్చారు ప్రభుత్వంవాళ్ళు. రెండు రోజులు గడిచిపోయాయి.

మూడోరోజు ఉదయాన్నే పెద్దన్నయ్య కనపడ్డాడు. ''లాభం లేదురా? అబ్బాయి. అంతటా ప్రయత్నించాను. దొరకలేదు.

అయిన కాడికి అమ్ముదామన్నా ఎవుడూ దొరకలే!'' అన్నాడాయన నిట్టూరుస్తూ. అప్పుడు గుర్తుకొచ్చాడు బొజ్జారాం. బొజ్జారాం నా చిన్ననాటి మిత్రుడు. ఒక్కసారి జరిగింది కళ్ళముందు సినిమాలా తిరిగింది.

నేను చదువుకునేరోజుల్లో ఒకసారి బొజ్జారాంను భోజనానికి పిలిచాను. ఆ మాట అమ్మతో చెపితే అంది. "మనది పదిమంది తినే ఇల్లు. ఆ కుర్రాడికి ప్రత్యేకంగా చేసేదేముంది? అలాగే తీసుకురా!'' అంది.

బొజ్జారాం సాయంత్రమే వచ్చి కూర్చున్నాడు. రాత్రి ఎనిమిదయ్యేవరకు భోజనం చేసే అలవాటు నాకు లేదు. అలాగే మా అన్నలిద్దరికీ. అక్కలు ముగ్గురు. చెల్లెళ్ళిద్దరు. మా ఇంట్లో చదూకుంటున్న మా మేనమామగారి కొడుకులిద్దరు. మా నాన్నగారు. చివర్న మా అమ్మ. తర్వాత పాలేళ్ళిద్దరూ.

బొజ్జారాం భోజనానికి వచ్చాడనగానే— "పోనీ! అతనికి పెట్టేద్దాం— రాత్రివరకు కూర్చోబెట్టడం ఎందుకు? వంట కూడా పూర్తయింది'' అంది అమ్మ.

బొజ్జారాం భోజనానికి కూర్చున్నాడు. మామిడికాయల పులుసు, ఉల్లిముద్దలో ఉడికించిన నాలుగు కిలోల వంకాయ కూర. మా చిన్నన్నయ్య కోసం చేసిన ఉల్లిపాయ, బంగాళదుంప వేపుడు, నాలుగు కిలోల అన్నం, పెరుగు క్షణాల్లో వూదేశాడు— మళ్ళీ మేం వంట చేసుకోక తప్పలేదు.

ఆ రాత్రి నాకు పడ్డ చీవాట్లు ఇంకా గుర్తున్నాయి. బొజ్జారాం తిండి పుష్టి అలాంటిది. విధవరాలయిన బొజ్జారాం తల్లి బాధపడుతూ వుండేది. బొజ్జారాం ఎలా బతుకు వెళ్ళదీస్తాడా అని. ఉన్న ఇల్లు, పొలం కాస్తా బొజ్జారాం భోజనానికి ఆరిపోయింది.

అదృష్టవశాత్తు బొజ్జారాం పెళ్ళి బాగా

## మరుపు



"ఏమండోయ్... మిమ్మల్నే మతిమరుపు తగ్గడానికి డాక్టరు చెప్పిన మందులు వేసుకున్నారా?'' అడిగింది అలివేలు.

"హయ్యో... మర్చిపోయానే'' అన్నాడు జ్ఞాపకమూర్తి.

"వేసుకోండి మరి'' చెప్పింది అలివేలు.

"ఏది... అసలు కొనడమే మర్చిపోయాను''

"మరి... వెళ్ళి కొనుక్కురండి.''

"ఎలా కొనుక్కురాను... ఆ ప్రిస్క్రిప్షన్ ఎక్కడ పెట్టానో మర్చిపోయాను''

"నా ఖర్మ... పోనీ మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళి రాయించుకురండి.''

"ఎలా వెళ్ళను ... నిన్న ఏ డాక్టరు దగ్గరికి వెళ్ళానో గుర్తుండి చస్తేనా'' విసుక్కున్నాడు జ్ఞాపకమూర్తి.

వి.శ.మణి ([illegible])

డబ్బున్న మోతుబరి కూతురితో అయింది. విచిత్రమేమిటంటే బొజ్జారాం భార్యకూడా మంచి తిండి పుష్టిగల మనిషి. బొజ్జారాం మామగారు చాలారోజులు గాలించిగాలించి చివరకు బొజ్జారాంను అల్లుడిగా చేసుకున్నారు.

బొజ్జారాం పెళ్ళయిన కొన్నాళ్ళకు వాళ్ళింటికి వెళ్ళాను. ఆ తర్వాత మర్చిపోయాను.

ఇక్కడకు దగ్గర్లోనే వుంటాడు బొజ్జారాం. వెళ్ళిమాస్తే. బొజ్జారాం నాకు కావల్సిన డబ్బిచ్చినా ఇవ్వవచ్చు!

అన్నయ్యల దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాను. బొజ్జారాం వూరు చేరుకొనే సరికి మధ్యాహ్నమయింది. బొజ్జారాం ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. ఊరిలో చాలా మార్పులొచ్చాయి. ఊరు చాలా పెరిగింది. కిళ్ళీ బడ్డీలు, పేపర్లమ్మే దుకాణాలు హోటళ్ళు కటింగ్ సెలూన్లు

బొజ్జారాం ఇంటిముందు సన్నగా తీగెలా వున్న అమ్మాయి ఒకర్తి కూర్చునుంది. నన్నుచూసి లేచి నిలబడింది.

''బొజ్జారాం ఉన్నాడా?'' అనడిగాను.

''ఆహ... ఉహు... మీరెవరు'' అడిగింది తడబడుతూ.

''బొజ్జారాం ఫ్రెండినమ్మా! చిన్ననాటి స్నేహం''

ఆ అమ్మాయి ముఖంలో శ్రావణమేఘం గా విషాదం అలుముకుంది.

''నాన్నగారు... నాన్నగారు...'' అంది గద్గద కంఠంతో. అర్థమైంది నాకు. ఈ విషయం నాకు ఎవరూ చెప్పలేదేం? ఎలా చెప్తారు? నాకు ఇప్పుడే కదా స్నేహితులు గుర్తుకొచ్చింది?

''చాలా అన్యాయం జరిగిందమ్మా! నా వయస్సువాడే. మరి అమ్మగారు?'' అడిగాను.

అమ్మాయి కనుకొనుకుల్లో నీటి బిందువులు జలజలారాలాయి.

ఏమిటీ ఇద్దరూ లేరా? మరి ఈ అమ్మాయికి ఆసరా?

''లోపలికి రండి బాబాయిగారు!'' అంది ఆ అమ్మాయి.

బొజ్జారం లేని ఇంట్లో నాకు ప్రవేశించబుద్ధికాలేదు. ఈ అమ్మాయి బొజ్జారాం కూతురు. తల్లీ తండ్రి లేనిది. ఏం చేస్తూవుంది?

నేను ఇంట్లోకి వెళ్ళాను. ''ఫర్వాలేదు. మంచి ఇల్లు మిగిల్చాడు. బాగా ఆస్తిపరుడు బొజ్జారాం మామగారు. అలాగే ఈ పిల్లకు అదంతా వచ్చేసుంటుంది'' అనుకున్నాను.

''కాళ్ళు కదుక్కోండి. తమ్ముడొస్తాడు. భోజనం చేద్దురుగాని'' అందా అమ్మాయి.

నాకు ఆకలిగా వుంది. సరే! అన్నాను.

''అక్కా! అక్కా!'' అని అరుస్తూ ఓ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు బయటనుంచి వచ్చాడు.

''ఓహో! ఈ కుర్రాడు బొజ్జారాం కొడుకన్నమాట'' అనుకున్నాను.

దూకుడుగా వస్తున్న ఆ కుర్రాడు నన్నుచూసి టక్కున ఆగిపోయాడు. ప్రశ్నార్థకంగా చూశాడు.

''నేను మీ నాన్నగారి స్నేహితుణ్ణి

బాబూ!" అన్నాను నన్ను నేను పరిచయం చేసుకుంటూ.

"నీ పేరేమిటి బాబూ?" అన్నాను మెల్లిగా.

"స్వామిరాం" అన్నాడు ఆ అబ్బాయి.

భోజనానికి కూర్చున్న నేను, చేసిన వంటకాలు చూసి మూర్ఛపోయాను.

పెద్దగిన్నె నిండా పులుసు, పెద్ద బేసిన్ నిండా కూర, గుండెగడు అన్నం. రుబ్బురోలు పాత్రమంత కొబ్బరిపచ్చడి.

"ఈ ఇంట్లో ఇద్దరే ఉన్నారు. పదిమందికి సరిపడా వండిందేమిటి ఈ పిల్ల?" అనుకున్నాను. స్వామిరాంను చూడగానే నా అనుమానం తీరిపోయింది.

అన్నం వడ్డించింది బొజ్జారాం కూతురు. నేను మొదటి ముద్ద ఎత్తేలోపల కంచంలో వేసిన అన్నం కూరతో సహా ఊదేశాడు స్వామిరాం. తర్వాత పెద్ద గిన్నెడు పులుసు. తర్వాత పచ్చడి నిమిషాల్లో మాయమయిపోయాయి.

తండ్రికి తగ్గ కొడుకు స్వామిరాం.

పట్టెడన్నం తన కోసం కాబోలు తీసి పెట్టుకుంది బొజ్జారాం కూతురు. కొంతలో కొంత నయం. ఈ పిల్ల బకాసురుడికి వారసురాలు కానందుకు తేలికగా మనసులో సంతోషించాను.

"అక్కా! మధ్యాహ్నం వస్తాను. టిఫినేం చేస్తావ్?" స్వామిరాం అడిగిన ఈ ప్రశ్నకు బాధపడుతూ అంది బొజ్జారాం కూతురు.

"నా పిండాకూడు. ఇంకా నేను తిండే తినలేదు" అంది విసుగ్గా.

"ఎందుకక్కా అంత కోపం?" చిన్నబుచ్చుకుంటూ అన్నాడు స్వామిరాం.

"ఏం లేదు నువ్వెళ్ళిఆడుకో!" అంది బొజ్జారాం కూతురు. ఎగురుకుంటూ స్వామిరాం వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళిన తర్వాత ఆమె అంది.

"అమ్మాయి! స్వామిరాం ఏమి చేస్తున్నాడు?" అడిగాను.

"ఏమి లేదు బాబాయి, తినడం తిరగడం. చదువు అబ్బలేదు. ఉన్నదంతా వీడి తిండికే సరిపోతోంది. ఎంత పెట్టినా ఇంకా చాలదంటాడు. భూములూ, ఆస్తులు అన్నీ కరిగిపోయాయి. కొంత మా నాన్నగారి హయాంలో. మిగిలింది ఇప్పుడు. ఈ ఇల్లు కూడా తాకట్టులో ఉంది. ఇది కూడా

## మచ్చలు మాయం



మీ బట్టల మీద ఇంక్ పడిందా? ఆ మచ్చలు పోవాలంటే వేడిపాలలో మచ్చవున్న ప్రాంతాన్ని కొన్ని నిముషాలు ఉంచి తర్వాత సబ్బుతో ఉతికితే మచ్చలు మాయమవుతాయి.

బట్టలకు 'తుప్పు' అంటితే ఆ ప్రాంతాన్ని ఆక్జాలిక్ ఆసిడ్ ద్రావణంలో ఉంచి, తర్వాత బోరాక్స్ ద్రావణంతో ఉతకండి! ఇంకాస్త తేలికగా కావాలంటే ఉప్పు, నిమ్మకాయ రసాన్ని రెండుమూడు లీటర్ల నీటిలో కలిపి అందులో బట్టల్ని కాసేపు ఉంచండి, తుప్పు పూర్తిగా పోతుంది.

జూపిటర్

ఇవ్వాళో రేపో మంగళం అయిపోతుంది."

"ఏ పరిస్థితి ఇలాగే వుందా?" అనుకున్నాను. పైకి అన్నాను— "కుర్రాడు తెలివైన వాడిలాగే ఉన్నాడే"

"పనికిరాని తెలివి" అని పెదవి విరిచింది.

బొజ్జారాం మిగిల్చింది స్వామిరాం జఠరాగ్నిలో కరిగిపోయింది. మరి ఈ అమ్మాయి పెళ్ళి?

"అమ్మాయి నీ పెళ్ళి అయిందా?" అని అడిగాను.

విషాదంగా నవ్వి అంది. "ఎలా అవుతుంది? ఆస్తీపాస్తీ లేదు. ఎవరూ దిక్కూ లేదు ఎవరు చూస్తారు? చేస్తారు?"

"బాధపడకమ్మా! నేనున్నానుగా! ఇకమీదట నీ బాధ్యత నేను తీసుకుంటాను" అన్నాను.

ఎలా అన్నానో ఆ మాట. నా పరిస్థితే అగమ్యంగా వుందే? భోజన సమయంలో మాటలో మాటగా నా పరిస్థితి చెప్పేమాశాను. ఆశ! ఈ అమ్మాయేమయినా డబ్బు సర్దుతుందని పిచ్చి ఆశ! నేనెలా ఈ అమ్మాయి పెళ్ళి చెయ్యడం.

పైగా స్వామిరాంను భరించగలనా?

ఆలోచిస్తూ వుంటే స్వామిరాం ఆదరాబాదరా వచ్చాడు. "ఏవండీ! ఏవండీ! మీ కోసం ఎవరో వచ్చారు?" అన్నాడు.

నా గురించా! ఇక్కడా ఎవరు? నేనెవరికి తెలుసు? బయటకు వచ్చి చూశాను.

ఏభై ఏళ్ళుంటాయి. బట్టతల. కళ్ళకు అద్దాలు. ఖద్దరు పంచె. జుబ్బా. టైరు చెప్పులు.

"అయ్యో! నా పేరు కూర్మారావు. మీ ఆస్తి కొనుగోలు చెయ్యాలని కొంత అడ్వాన్సు ఇచ్చాను?"

"మీరు మా ఆస్తి కొంటారా?"

"కొంటారా కాదు బాబు! ఎడ్వాన్సు కూడా ఇచ్చాను. మొత్తం ముప్పయి లక్షలకు అంగీకారం కుదిరింది"

"ఏమిటి? ఎప్పుడు బేరం కుదిరింది?" అడిగాను నేను.

"నెల దాటింది—"

"మరి... మరి..."

"మీ అన్నయ్యలను అడిగానండి. వారన్నారు, మీకు ఆ ఆస్తిలో హక్కు లేదని"

"హక్కు లేదా? ఎందుకు..."

"ఆ వివరాలు నాకు తెలీవు. మా లాయరుగారు కూడా అది నిజమేనన్నారు!"

లాయరు కూడా ఆ మాట నిజమన్నారా? ఎలా జరిగిందిది? ఇన్నాళ్ళూ నేను చూపిన అలసత్వమే ఇందుకు కారణమా?

"ఏవండీ! మీరు ఈ ఆస్తి కొంటే చిక్కుల్లో పడతారు!" అన్నాను ఏమి చెప్పాలో తెలియక.

"రేపోమాపో రిజిస్ట్రేషను అవుతుందండీ. ఏం చిక్కులు లేవని మా లాయరన్నాడు. అయినా ఓ మాట మీ చెవిన వేద్దామని"

ఆస్తిలో నాకు వాటా లేదని ఎలా చెప్పారు. ముప్పయి లక్షలకు అమ్మేస్తే మూడోవంతు నాకు పదిలక్షలు రావాలే'

ఆ ముసలాయన వెళ్ళిపోతూ అన్నాడు.

"స్వామిరాం చెప్పాడు. మీరు ఫలానా అని"

భోజనం చేస్తున్నప్పుడు వే చెప్పినది విన్నాడు స్వామిరాం.

మా ఆస్తి కొన్న మనిషికి ఆ విషయం తెలిపి వాతో మాట్లాడేటట్టు చేసాడు.

స్వామిరాం అలా వెయ్యకపోతే కొన్నాళ్లవరకు నాకీ విషయం తెలిసేదికాదు. స్వామిరాం నాకు మేలే చేశాడు. మా అన్నలు నన్ను మోసం చేశారు. అన్నమాట ప్రకారం స్వామిరాంను నాతో తీసుకెళ్ళాలని నిశ్చయించుకున్నాను. బొజ్జారాం కూతుర్ని దగ్గరలో వున్న వాళ్ళ బంధువులింట్లో అప్పజెప్పి మేమిద్దరం బస్సుస్టాండుకు వచ్చాం.

బస్సు బయలుదేరింది. స్వామిరాంను నా భార్య ఎలా అంగీకరిస్తుంది. నాకు వెలవెలా జీతం రాదు. బ్యాంకులో వున్న కొద్ది డబ్బు స్వామిరాంతో ఎన్నాళ్లు వస్తుంది.

బస్సు లంఖణాల బండిలా నెమ్మదిగా నడుస్తోంది. పాత ఫోర్డు బండి, మూల్గుతూ మూలుగుతూ మధ్యాహ్నానికి వూరు చేరాం.

ఇప్పుడు వంట అంటే ఇల్లాలు విసుక్కుంటుంది. స్వామిరాంకు వంట అంటే మరీ విసుక్కుంటుంది. ఈ రోజుకు హోటల్లో తింటే?

నేనూ, స్వామిరాం బస్సుస్టాండునుంచి 'కోమలా విలాస్' హోటలుకుచేరాం. చాలామంది భోజనం చేస్తున్నారు. టేబులుముందు కూర్చున్న తర్వాత భయం బయలుదేరింది. నా దగ్గరున్న డబ్బు చాలతాయా?

అరటి ఆకువేసి అన్నం వడ్డించాడు సర్వరు. వడ్డన మొదయింది. అయిదు నిమిషాల్లో స్వామిరాం ప్రతాపం కనిపెట్టేశాడు వాడు. వెళ్ళి



ప్రొప్రయిటరును పిలుచుకువచ్చాడు. అతను నన్ను ప్రక్కకు పిలిచి అన్నాడు.

"మేష్టారూ ఇంకా చాలామంది భోజనాలు చెయ్యాలి. మీరు మీ అబ్బాయిని తీసుకువెళ్ళండి. డబ్బులివ్వవద్దు" హోటలు యజమాని ప్రాధేయపడుతూ వుంటే నాకూ జాలివేసింది.

తింటున్న తిండి వదలమనడం అన్యాయం! నిబ్బరంగా అన్నాను. "ఎంతయినా ఫర్వాలేదు. వాడిని కడుపునిండా తిననివ్వండి"

స్వామిరాం భోజనం పూర్తయింది. హోటలువాడు లెక్కలు వేసి ఎనభై రూపాయలు బిల్లువేశాడు. బిల్లు చెల్లించడానికి పర్సు తీశాను. ఏభై రూపాయల నోటు ఒకటి కొన్ని చిల్లరనోట్లు.

లెక్కపెడుతున్నాను నోట్లు. మొత్తం నోట్లు, చిల్లర అంతా కలిపి ఇచ్చేశాను. పర్సులో చాలా కాగితాలున్నాయి. పర్సులో పెట్టి వాటి సంగతే మర్చిపోయాను. ఆఫీసుకు సంబంధించిన కాగితం ఒకటి కనపడింది.

పాత ఇన్‌వాయిస్. లెక్కల్లోకి తీసుకోనిది. ఎనిమిదివేల చిల్లర వుంది దాని విలువ. రెండు లక్షల షార్టేజీలో కొంత దొరికింది.

హోటల్లోనుంచి బయటకువస్తూ అన్నాను స్వామిరాంతో. "నీ బిల్లువల్ల నాకు కావలసిన పాత కాగితం ఒకటి దొరికింది."

"మిగిలినవి కూడా అలాగే దొరుకుతాయి" అన్నాడు స్వామిరాం.

"అలా దొరికితే నీకు పక్కాని విందు ఏర్పాటుచేస్తాను"

ఇంటికి వెళ్ళిన తర్వాత ఇంట్లో పాతకాగితాలన్నీ వెతికాను. మిగిలిన కాగితాలు కనపడలేదు.

ఆస్తిలో జరిగిన దగా గురించి మా లాయరుకు చెప్పాను. ఆయన కోర్టులో స్టే కోసం మా ఊరు వెళ్ళాడు.

స్వామిరాం రోజువారీ సాదా భోజనానికీ మా ఇంటావిడ రోజంతా వంటింట్లో విసుక్కుంటూ గడిపేస్తోంది. బ్యాంకులో డబ్బు చాలామటుకు అయిపోయింది. పది రోజుల తర్వాత ఖండితంగా చెప్పేసింది ఇంటావిడ నా వల్లకాదని.

నాకు తప్పలేదు. స్వామిరాంను తీసుకుని హోటలుకు బయలుదేరాను. ఎనభై రూపాయలు దగ్గరుంచుకున్నాను. 'కోమలా విలాస్' ఓనర్ స్వామిరాంను చూడగానే దండం పెడుతూ నా దగ్గరకు వచ్చాడు. "అయ్యా! క్షమించండి. నన్ను దివాలా తీయించకండి" అన్నాడు.

మరో ఫర్లాంగు దూరంలో వున్న 'వెల్‌కం హోటలు'కు తీసుకువచ్చాను స్వామిరాంను. ఆ హోటలు యజమాని మంచి వ్యాపార సరళి తెలిసిన మనిషిలా వున్నాడు. అక్కడ ప్లేటు మీల్సే. స్వామిరాంకు ప్లేటు మీల్సంటే వాములు తినే స్వాముల వారికి పచ్చగడ్డి ఫలహారం పెట్టినట్టే.

"బాబాయి నేనివ్వాళ అన్నం తినను. స్వీట్లు తింటా" అన్నాడు.

ఒక ప్లేటు మైసూరుపాక్‌లు, ప్లేటు పేడా ఏం సరిపోతుంది స్వామిరాంకు.

‘వెల్‌కం’ హోటల్లో స్వీట్లన్నీ మాయం చేశాడు స్వామిరాం.

బిల్లు రెండొందలు దాటింది. దగ్గరున్న ఎనభై చాలదు. ఏం చెయ్యాలి? ఎవ్వరి దగ్గరైనా అప్పు చెయ్యాలి. అప్పెవరిస్తారు?

అదే వీధిలో మా లాయరున్నాడు. అవసరార్థం ఆయన దగ్గరే తీసుకోవాలి.

స్వామిరాంను అక్కడేకూర్చోబెట్టి ‘హోటలు’ యజమానికి ఇంకేమీ ఇవ్వవద్దని రహస్యంగా చెప్పి లాయరు దగ్గరకు బయలుదేరాను. లాయరు నాకు ఇంకో రకంగా పరిచయం. క్లబ్బులో వారానికి ఒకటి రెండుసార్లు కలుసుకునేవాళ్ళం.

నే వెళ్ళేసరికి లాయరు ఆఫీసులో ఒక్కడే ఉన్నాడు. నన్ను చూడాగానే నవ్వి అన్నాడు.

“రండి నేనే కబురు చేద్దామనుకుంటు న్నాను. మీ ఆస్తి ట్రాన్స్‌ఫర్‌లో స్టే తెచ్చాను”

“ఆస్తిలో నాకు భాగం లేదని మా అన్నలు ఎలా అన్నారు?”

“వాకబు చేశాను. మీ స్కూలు రికార్డులో మీ నాన్నగారి పేరు ‘సూర్య నరసింహం’ బదులు ‘సూర్యనారాయణ’ అని వుంది. అందువల్ల మీరు ‘సూర్యనరసింహం’ కొడుకు కాదని మడతపేచీ పెట్టి మీకు వాటా రాకుండా చెయ్యాలని చూశారు.”


“అవును నాకు గుర్తుకొచ్చింది. ‘సూర్యనరసింహం’ బదులు ‘సూర్యనారాయణ’ అని తప్పుగా రాసినప్పుడే అది చూపించాను హెడ్‌మాస్టర్‌కి. తర్వాత సవరిస్తానన్నాడు. మర్చిపోయినట్లున్నాడు. నేనూ పట్టించుకోలేదు ఆపైన..”

“మీరు వ్రాతమూలంకంగా ఏమైనా ఇచ్చారా?”

“గుర్తులేదు. అది లేకపోతే నా ఆస్తి నాకు రాదా?”

“మీ అన్నలు లోకల్‌గా పలుకుబడి వున్నవాళ్ళు. మిమ్మల్ని మీ ఊరిలో ఎవరూ గుర్తించరు. సాక్ష్యాలు బలంగా వాళ్ళవైపే ఉన్నాయి. ఆ అన్నట్టు ఇంకో విషయం. మొన్న క్లబ్బుకెళ్ళాను. అక్కడ మీ జిప్‌బేగ్ ఒకటి మర్చిపోయారు. అది నరసింహం— మీ ఆఫీసులో సూపరింటెండెంటు— మీకిమ్మని ఇచ్చాడు”

ఆ బేగ్ అందుకుంటూ అడిగాను. “ఓ నూటయాభై కావాలి”



## పందు

భూమ్యాకర్షణ శక్తి గురించి పాఠం చెప్పిన సైన్సు మాష్టారు—

“ఏరా అప్పల్నాయుడూ... చెట్టుమీంచి పండు భూమ్మీదే ఎందుకుపడుతుంది. ఆకాశంలో పడదెందుకు చెప్పు” అని అడిగాడు.

“తెలివోళ్ళు భూమ్మీదే వుంటారు గదండీ... అందుకనండి” చెప్పి కూర్చున్నాడు అప్పల్నాయుడు.

—పిరిపిల్లా రషీద్ శిక్షక్ (జంగంపల్లి)

ఆయన ఇచ్చిన డబ్బు తీసుకొని 'వెల్కం' హోటలు కెళ్ళి, డబ్బిచ్చి ఇంటివైపు బయలుదేరాము.

ఇంటికెళ్ళిన తర్వాత యథాలాపంగా జిప్ తెరిచాను. కళ్ళు జిగేల్మన్నాయి. ఒక కట్ట విలువైన కాగితాలు. నోట్లు కాదు. బిల్లులు, ఇన్వాయిస్లు. ఒక్కొక్కటి తీసి చూశాను. స్టాకు రిజిస్టరులో ఎక్కవలసిన రెండు లక్షల విలువైన కాగితాలు. ఎవరో ఆఫీసు రికార్డుల్లోనుంచి తీసేసి కంగారులో నా సంచీలో పడేశారు. నెత్తిమీదనుండి పెద్ద బరువు దిగినట్టయింది. ఇప్పుడు నేను రెండు లక్షలు కట్టక్కర్లేదు.

అప్పుడనిపించింది. స్వామిరాం రాకతో నా సమస్యలు తగ్గుతున్నాయి. అది నమ్మకంగా మారి బలపడింది.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళి ఆ బిల్లులన్నీ సబ్మిట్ చేసి స్టాకు రిజిస్టరు కరెక్టు చేసి వచ్చాను. సస్పెన్షన్ రద్దయింది. అయితే నా నిర్లక్ష్యానికి శిక్షగా రెండు ఇంక్రిమెంట్లు ''కట్'' చెయ్యమని సిఫారస్ చేస్తూ పైకి రాశాడు మా ఆఫీసరు. నేనేం బాధపడలేదు.

స్వామిరాంకు సంతోషం కలిగించేదేమిటో నాకు తెలుసు. సుష్టుగా భోజనం. నా ఉద్యోగం తిరిగి రావడానికి కారణం స్వామిరామే అని నా నమ్మకం. అది బలపడటానికి ఓ పరీక్ష పెట్టాను మరోమారు స్వామిరాంకు విందు ఏర్పాటు చెయ్యాలని.

వారం తర్వాత ఆ రోజు వచ్చింది. బ్యాంకునుంచి అయిదువేలు డ్రా చేశాను. స్వామిరాంకు 'మాంఛి' విందు చెయ్యడానికి మా ఆవిడ కూడా ఒప్పుకుంది.

మల్లెపూవులాంటి అన్నం, దోసకాయ పచ్చడి, బెండ, ఆనప పెలగడ దుంపల పులుసు, తియ్యపప్పు, బూంది లడ్డు, కిస్మిస్లూ, జీడిపప్పువేసి తియ్యటి పాయసం, అప్పడాలు, చిప్స్, గడ్డపెరుగు దండిగా తయారుచేయించాను.

ఆనందంతో ఎగబడ్డాడు స్వామిరాం. నిమిషాల్లో పదార్థాలు మాయమైపోయాయి. ఆరోజు చిన్నగా త్రేన్చాడు స్వామిరాం.

''ఈరోజు కడుపునిండింది'' అన్నాడు. అంటే ఓమాదిరిగా అని నాకు తెలుసు.

ఆ రాత్రి చల్లగాలిలో నేనూ స్వామిరాం నడుచుకుంటూ లాయరు ఇంటకి బయలుదేరాం. స్వామిరాం సన్నగా పాట పాడుతున్నాడు.

మొదట కూనిరాగమనుకున్నాను. కాదు. రాళ్ళు వెతుకుతూ వుంటే కాంతులీనే మణి దొరికినట్టుగా స్వామిరాం కంఠధ్వని, మంద్రంగా, తియ్యగా మధురంగా ధ్వనించింది.

అబ్బురపడుతూ అడిగాను. ''స్వామిరాం! నీకు సంగీతం వచ్చా?''

''సంగీతం కాదు. పాటలు పాడ్తాను. ఇంటిదగ్గర వినిపిస్తా'' అన్నాడు.

ఇద్దరమూ లాయరింటికి వెళ్ళాము. ఆయన అప్పుడే భోజనం చేసి బయట కుర్చీలో కూర్చున్నాడు.

''మీరేనా? నేనే కబురు పెడదామనుకున్నా! మీ స్కూలు రికార్డు కరెక్టు చెయ్యమని హెడ్మాస్టరు రాసిన ఉత్తరం డి.ఇ.ఓ ఆఫీసులో దొరికింది. నకలు

సంపాదించాను. అది మీ అన్నయ్యలకు చూపించాను'' అన్నాడాయన.

''నా వాటా ఇవ్వడానికి ఒప్పుకున్నారా?'' ఆతృతగా అడిగాను.

''లేదు. మెట్టపాలెం వదులుకుంటార్ట. లేకపోతే కేసు నడవనీ'' అన్నారు.

''అలాగే కానీయండి. బాగా ఖర్చవుతుందా?''

''అవును. సివిల్ కేసు కదా! చాలా ఏళ్ళు పట్టవచ్చు. ఇరవై ఏళ్ళ కేసులు ఇంకా 'లిస్టింగ్'కూడా కాలేదు.''

ఆలోచనలో పడ్డాను నేను. నా దగ్గర దాచుకున్న డబ్బు లేదు. ఏళ్ళ తరబడి వాజ్యం నడిపే ఓపిక నాకు లేదు. స్వామిరాం వచ్చిన తర్వాత నాకు మంచి జరుగుతోంది. అతన్నే అడిగితే బాగుంటుందని అనిపించింది.

''స్వామిరాం ఏం చేద్దాం'' అనడిగాను.

''మెట్టపాలెం మీకు కలిసొస్తుంది'' అన్నాడు స్వామిరాం.

* * *

ఇంటికి వెళ్ళిన తర్వాత స్వామిరాం అన్నట్టుగానే పాట పాడాడు.

ఆ పాట విని 'షాక్' అయిపోయాను. అంత సుమధుర, మంజుల,మనోహర గానం నా జన్మలో వినలేదు. పాట విన్న ఆ అయిదు నిమిషాలు నన్ను నేను మరిచిపోయాను. అలౌకిక ఆనందం అనుభవించాను. నా మనసు ఆర్ద్రమైంది. కళ్ళు చెమర్చాయి.

తడికళ్ళతో తలతిప్పి చూశాను. పదిపదిహేనుమంది జనం గుమికూడి ఉన్నారు. మా ఇంటి పక్కల జనం. అందరి ముఖాలలోనూ ఆశ్చర్యం. స్వామిరాం గొంతులో దేవకన్యల సంగీతలహరి వాళ్ళకు వినిపించింది కాబోలు. మళ్ళీ పాట పాడాడు స్వామిరాం. తీరని దాహంతో బాధపడుతున్న వాడికి అమృతం పోసినట్లుగా తన్మయత్వంలో మరో లోకాలకు

## లోహ ప్రపంచం



మనకు సహజసిద్ధంగా అనేక లోహాలు లభ్యమవు తున్నాయి. అయితే ధర్మాల విషయంలో రకరకాలుగా అవి ప్రవర్తిస్తూ వుంటాయి! మనకు అతి ఎక్కువగా లభ్యమయే లోహం అల్యూమినియం! తేనెటీగల మైనం కన్నా మెత్తగా ఉండే లోహం సీసియం. అత్యధిక ద్రవీభవన స్థానం ఉన్న లోహం టంగ్‌స్టన్ (3380 డిగ్రీల సెల్సియస్). అత్యల్ప ద్రవీభవన స్థానం (30 డిగ్రీల సెంటిగ్రేడ్ డిగ్రీలు) ఉన్న లోహం గాలియం! గది ఉష్ణోగత వద్ద ద్రవంగా ఉండేలోహం పాదరసమని మన కందరకూ తెలిసిన విషయమే కదా! అలాగే మనకు బాగా పరిచయమైన రాగి, వెండి, బంగారం, ఇనుము కూడా లోహాలే!

—జూపిటర్.

తరలిపోయ్యాం. తాత్కాలికంగా!

అర్థరాత్రి దాటిన విషయం మర్చిపోయాం.

ఆ వార్త ఊరంతా గుప్పుమంది. స్వామిరాం రాకతో మా సమస్యలు తీరిపోయాయని తెలియగానే అతడి మీద జనం దాడి ప్రారంభమైంది. మా ఇంటి చుట్టుపక్కల వాళ్ళు ఏదో ప్రశ్నలడిగారు. స్వామిరాం ఏవో చెప్పాడు. మా లాయరుగారు కూడా స్వామిరాంను ఏదో అడిగారు. అతను చెప్పింది జరిగిందట. ఆయన బార్లో స్నేహితులతో స్వామిరాం గురించి చెప్పారు.

స్వామిరాం మా ఇంటికి వచ్చిన వారంరోజులకే చాలా ప్రాముఖ్యం సంపాదించాడు.

నాకూ, మా అన్నలకూ రాజీ కుదిరి, నాకు 20 ఎకరాల మెట్ట వచ్చింది. వాటి తాలూకు పత్రాలిస్తూ లాయరు అడిగారు ఇప్పుడేం చేస్తారని. స్వామిరాంను అడిగి చెప్తానన్నాను.

రోజులోగా స్వామిరాంకు ఆహార సమస్య తీరిపోయింది. రోజుకొకరింట్లో ఆతిథ్యం. స్వామిరాం భోజనం చేస్తున్నప్పుడు ఎవరూ చూడకుండా నేను జాగ్రత్తపడ్డాను.

నెలతిరిగే సరికి మా వీధిలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటుచేశారు పోలీసు డిపార్ట్‌మెంట్.

లాయరుగారు ఓ మంచి సలహా ఇచ్చారు. మా ఊర్లో నాకు వచ్చిన ఇరవై ఎకరాల మెట్టలో రెండు మూడెకరాలు స్వామిరాంకు ఇమ్మన్నారు. అక్కడ స్వామిరాం ఆశ్రమం లాంటిది ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు. నేను అందుకు అంగీకరించాను.

ఇష్టదైవాన్ని చూడటానికి భక్తులు ఎంత దూరమైనా వెళ్తారు. స్వామిరాం ఆశ్రమం ఇప్పుడు విశాలంగా ఉంది. అన్నీ ఏర్పాట్లు చేసి నేను తిరిగి పట్నం వచ్చేశాను. అయినా నా మనసంతా స్వామిరాం పాటమీదే వుంది.

నెల రోజుల వరకు తీరిక లేక స్వామిరాంను చూడలేదు. ఆ తర్వాత వచ్చే ఆదివారం స్వామిరాం ఆశ్రమానికి బయలుదేరాను.

విశాలంగా రేకు షెడ్లు వెలిశాయి. స్వామిరాం తన దర్శన వేళలు, పూజ వేళలు క్రమబద్ధం చేశాడు.

నేను వెళ్ళేసరికి మధ్యాహ్నమైంది. ఆశ్రమంలో అడుగుపెడుతూనే ఆ అద్భుత దృశ్యాన్ని చూసి అదిరిపడ్డాను.

నిలువెత్తు దేముడి పటం. వెలుగుతున్న అగరు వత్తులు. గుట్టగా పడివున్న పూలు.

పళ్ళేలనిండా తిరుపతి లడ్డంత సైజులో లడ్లు, మామూలు బూంది లడ్లూ, కరిజి కాయలు, పేణీలు, పేడాలు, బాద్‌షాలు, ఎరుపురంగులో రసాలూరుతున్న జిలేబీలు, మైసూర్‌పాకులు పెద్ద సైజువి, పాల కోవాలు. మరోప్రక్క, గసగసాలు చల్లిన బొబ్బట్లు, పూర్ణం బూరెలు, బెల్లం మిఠాయిలు, అరిశెలు, జీడిపాకాలు, మరో పళ్లెంలో, ముదురు పసుపురంగులో నిగనిగ మెరుస్తున్న జీడిపప్పు ఎండు మిరపకాయలలో పులిహోర, వెండిగిన్నెల్లో కిస్‌మిస్‌లు తేలుతున్న పాయసాలు, ఇంకో

పళ్ళెంలో నేతిలో వేయించిన జీడిపప్పు, చక్కిలాలు పాలకాయలు, జంతికలు గుట్టలుగా పేర్చివున్నాయి.

మరో పళ్ళెంలో ఘుమఘుమలాడుతున్న పనసతొనలు. బంగారురంగులో బంగినపల్లి మామిడిపళ్ళు, రసాలు, మరో పళ్ళెంలో బాగా పండిన సపోటాలు, ఇంకో పళ్ళెంలో కొమ్ము అరటిపళ్ళు పేర్చివున్నాయి.

స్వామిరాం నన్ను చూడగానే జనాన్ని వెళ్ళమని సైగ జేశాడు. ఆశ్రమానికి తగ్గట్లుగా స్వామిరాం వేషం కూడా మారింది.


స్వామిరాం ఈ తినుబండారాలన్నీ తినగలడా అని అనుమానం వచ్చింది. అందరూ బయటకు వెళ్ళినా స్వామిరాంతో నాకున్న చనువువల్ల అక్కడే వుండిపోయాను.

అప్పుడు నా అనుమానం నివృత్తి అయింది.

స్వామిరాం శక్తి అమోఘం.

నేను ఒక లడ్డు తినే లోపల మొదటి వరుస ఫలహారాలన్నీ ఎగిరిపోయాయి. నేను చెంబెడు నీళ్ళు నోట్లో పోసుకునే సరికి, పనస తొనల పళ్ళెం ఖాళీ చేశాడు.

నేను 'బ్రేవ్' అని తేన్చేసరికి స్వామిరాం 'బ్రేవ్' మని తేన్చి "ఇవాళ నాకు కడుపు



నిండింది'' అన్నాడు.

గుడ్లు తేలేసి ''కడుపు నిండిందా' అనడిగాను.

* * *

సాయంత్రం భజన కార్యక్రమం స్వామిరాం తియ్యటి గొంతుక ఆ ప్రాంతమంతా గులాబీ సువాసనలా అలుముకుంది. అప్పుడే నన్నెవరో పిలిచారు. బయటకు వెళ్ళాను.

కారులో కూర్చున్నాడు ఒకాయన. సిల్కు లాల్చీ, మెడలో బంగారం గొలుసు, చేతిలో పొమ్మకర్రి, నన్నుచూసి 'నమస్కారం' అన్నాడు. ఆయన పక్కనున్న మరో మనిషి అన్నాడు.

''వీరు అడుగుతున్నారు. మీ భూమి అమ్మే వుద్దేశం వుందా అని. ఎకరానికి పదివేలిస్తారుట'' అన్నాడు.

స్వామిరాం పాట వినలేక పోతున్నందుకు బాధపడుతూ అన్నాను. లేదు లక్ష ఇచ్చినా ఇవ్వను.

''లక్షా!'' అని రెండు నిమిషాలకు ''సరే మొత్తం అంతా ఇచ్చేస్తారా?'' అనడిగాడు.

ఆశ్చర్యంతో నాకు నోట మాట రాలేదు. ఎకరం అయిదొందలు కూడా పలకని మెట్టభూమికి లక్షా?

''మీరేం చేస్తారు?'' అనడిగాను.

''అది మేం చెప్పనక్కర్లేదు. ఎకరానికి లక్ష లెక్కన ఎంత అమ్ముతారు''

'పదెకరాలు' అన్నాను ఆలోచించకుండా!

'సరే! ఎల్లుండి వచ్చి నాలుగోవంతు బయానా ఇస్తాం' అని కారు స్టార్టు చేసి వాళ్ళు వెళ్ళిపోయారు.

నాలుగో వంతు— అంటే రెండున్నర లక్షలు. అంత డబ్బు ఏం చెయ్యాలి?

తళుక్కున ఆలోచన వచ్చింది. బొజ్జారం కూతురు పెళ్ళి!

మళ్ళీ వెళ్ళి భజనలో కూర్చున్నాను. పాట మృదువుగా సాగిపోతోంది. నేను ఆలోచనల్లో పడ్డాను.

స్వామిరాం ఆహార సమస్య తీరిపోయింది.

బొజ్జారాం కూతురు పెళ్ళి అవుతుంది.

పోయిందనుకున్న ఉద్యోగం తిరిగొచ్చింది. ఇదంతా ఎలా?

స్వామిరాం మా ఇంటిలో అడుగుపెట్టగానే నాకు అన్నీ శుభాలే జరిగాయి. ఆదివారాలు క్లబ్బులో మధుపానం పేకాట ఆగిపోయాయి.

అప్పుడే అనుకున్నాను. మిగిలిన ఆ పదెకరాలు స్వామిరాంకు ఇచ్చేయాలని.

బొజ్జారాం ఆత్మ స్వర్గంలో సంతృప్తిగా వుండి వుండవచ్చు.

అయినవాళ్ళు మోసం చేసినా బొజ్జారం నాకు దూరమైనా తన కొడుకు ద్వారా నన్నాదుకున్నాడు. పిడికెడన్నానికి బండెడు లాభం చేకూర్చాడు. మెతుకుకొక రూపాయి చొప్పున నాకు లక్షల కొద్దీ లాభం వచ్చేటట్టు చేశాడు.

మరి మా బంధం ఏనాటిదో.